క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కురసాల

కరప: వేళంగిలో నిర్మించే బస్ షెల్టర్ నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ బుధవారం భూమిపూజ చేశారు. రూ.5 లక్షలతో ఈ షెల్టర్ నిర్మిస్తున్నారు. వేళంగి, సిరిపురం, జి.భావారం గ్రామస్తులు, విద్యార్థుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి నిధులు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. వేళంగి, జి.భావారం సర్పంచ్‌లు సవిలే నీలిమ, రొక్కాల గణేష్, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సంఘం గుర్తింపును పునరుద్ధరించాలి

కాకినాడ సిటీ: పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై బుధవారం స్థానిక జిల్లా సీఐటీయూ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కేంద్ర కార్మిక సంఘాలు పాల్గొని నేషనల్ ఫెడరేషన్ అఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గుర్తింపును పునరుద్ధరించేంత వరకు పోరాడాలని పోస్టల్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వంతో కార్మికులు పోరాడి సంఘం పెట్టుకునే హక్కును 1926లో సాధించి, మొట్టమొదటి రిజిస్టర్ చేసిన సంఘం పోస్టల్ ఉద్యోగులలో 70 శాతం సభ్యత్వం కలిగిన ఉద్యోగుల గుర్తింపును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అసంబద్ధ కారణాలతో రద్దు చేయడం ట్రేడ్ యూనియన్ 1926 చట్టానికి వ్యతిరేకమని, ఇది కార్మికుల పట్ల, ఉద్యోగ సంఘాల పట్ల ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కేంద్ర కార్మికసంఘాల ప్రతినిధులు దువ్వా శేషుబాబ్జీ, జె.వెంకటేశ్వరరావు, తాళ్లూరి రాజు, గొడుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: స్థానిక 33/11 కేవీ జగన్నాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు తొలగిస్తుండడంతో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.ప్రసాద్ బుధవారం రాత్రి తెలిపారు. అలాగే జగన్నాథపురం, అన్నమ్మఘాటీ విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ ఘాటీ ఫీడర్ పరిధిలోని జె రామారావుపేట, కోమలివారి వీధి, చిన్నిమెస్ ఏరియా, ఎంఎస్ఎన్ చారిటీస్ ఏరియా, గొల్లపేట, ఘాటీ సెంటర్, మున్సిప్‌గారి జంక్షన్, నేతాజీ పార్కు ఏరియా, ముగ్గుపేట, రెల్లిపేట, గాయత్రినగర్, గణేష్‌నగర్, భానువారి వీధి, బొంతువారి వీధి, మహాలక్ష్మిపేట, సత్యవేదకాలనీ, మేకానారాయణమ్మతోట, బాపూజీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఇంద్రపాలెం పరిధిలో..

ఇంద్రపాలెం 33/11 కేవీ ఉపకేంద్రం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. కొవ్వాడ, రేపూరు, గంగనాపల్లి, స్వామినగర్, శ్రీనివాసనగర్, చీడిగ, ఇంద్రపాలెం శ్రీనివాసనగర్, మెయిన్‌రోడ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు.

రూరల్‌లో..

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ తెలియజేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొవ్వాడ, రేపూరు, గంగనాపల్లి, స్వామినగర్, శ్రీనివాసనగర్, చీడిగ, ఇంద్రపాలెం శ్రీనివాసనగర్‌లలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

12న చలో సీఎం కార్యాలయం

కాకినాడ సిటీ: ఇటీవల అకాల వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న వరి, పసుపు, మొక్కజొన్న, అరటి, మామిడి తదితర పంటల రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఈనెల 12న చలో సీఎం కార్యాలయం ముట్టడికి రైతులు, ఇతర వర్గాలు తరలిరావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. బుధవారం కాకినాడలో పీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పార్టీ ప్రజా సంఘాల శాఖ కార్యదర్శుల జిల్లా స్థాయి వర్క్‌షాపు జూన్ 15, 16, 17 తేదీల్లో కాకినాడలో నిర్వహిస్తున్నామన్నారు.

నిప్పులు చెరుగుతున్నట్టు..



అచ్చంపేట జంక్షన్‌లో నిర్మానుష్యంగా..

కాకినాడ రూరల్: అకాల వర్షాలతో వేసవిలో చల్లదనాన్ని ఆస్వాదించిన ప్రజలు ఇప్పుడు ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్నారు. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు నమోదవుతున్నప్పటికీ తాపం మాత్రం 40 డిగ్రీలకు మించినట్టు ఉంటోంది. దీనికి తోడు వడగాడ్పులతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. మోచా తుఫాన్ ప్రభావం ఏపీపై లేకపోవడంతో రానున్న రోజుల్లో మరింతగా ఎండ పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. వడగాల్పులు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

చెరువులకు మోక్షం

- రూ.42 లక్షలతో పూడికతీత పనులు
- 12,441 పనిదినాలతో కూలీలకు ఉపాధి
- ఎమ్మెల్యే కన్నబాబు సూచనలతో చురుగ్గా పనులు



కొరిపల్లి చెరువులో పూడిక తీస్తున్న కూలీలు

కరప: మండల పరిధి గ్రామాల్లో ఉపాధి పనుల ద్వారా చెరువులకు మోక్షం కలగనుంది. ఈ ఈ పనుల ద్వారా జాబ్‌కార్డు కలిగిన కూలీలకు 12,441 పనిదినాలు కల్పిస్తున్నారు. వేళంగి, వలసపాకల, వేములవాడ, కూరాడ, పెదకొత్తూరు, పెద్దాపురప్పాడు, కొంగోడు, పాతర్లగడ్డ, నడకుదురు, కొరిపల్లి, గొడ్డటిపాలెం, గొర్రిపూడి గ్రామాల్లోని పంచాయతీ చెరువులు, రజకుల చెరువులు, మంచినీటి చెరువులు పూడుకుపోయాయి. దీంతో ఆయా చెరువులలో నీటినిల్వలు పూర్తిస్థాయిలో లేక ప్రజల అవసరాలు తీర్చలేకపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో తాగునీటి అవసరాలకు, మరికొన్ని గ్రామాల్లో పశువులను కడగడానికి, వాటి దాహార్తి తీర్చడానికి, మరికొన్ని చెరువులను దుస్తులు ఉతకడానికి వినియోగిస్తుంటారు. ఈ చెరువుల్లో పూడిక తీసి చాలాకాలం కావడంతో నీటినిల్వలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. ఆయా చెరువులను శుభ్రం చేయించాలని రజకులు, ప్రజలు, రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఉపాధి నిధులతో చెరువుల్లో పూడిక తీయించాలని ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశించారు. ఈ మేరకు ఉపాధి సిబ్బంది స్పందించి ఏయే గ్రామాల్లో ఏయే పనులు చేయించాలో గుర్తించి, ప్రతిపాదనలు, గ్రామసభలు నిర్వహించి, తీర్మానాలు చేసి పంపించారు. 12 గ్రామాల్లో 12 చెరువుల్లో పూడిక తీయించేందుకు రూ.42 లక్షలు మంజూరయ్యాయి. దీంతో వేళంగి, కొరిపల్లి, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత చేపట్టగా ముమ్మరంగా సాగుతున్నాయి. గత వారం అకాల వర్షాల వల్ల పూడిక తీతకు ఆటంకం ఏర్పడింది. తాజాగా నాలుగు రోజులుగా ఎండలు కాస్తుండడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

చురుగ్గా సాగుతున్నాయి



ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉపాధికూలీలకు పెరిగిన రోజువారీ వేతనం రూ.279 వచ్చేలా కొలతలువేసి, పనులు చేయిస్తున్నాం. చెరువుల్లో పూడిక తీయించడం ద్వారా కూలీలకు పని కల్పించాలని ప్రతిపాదించాం

– జి.రమణకుమార్, ఏపీఓ, ఉపాధి పథకం

చిన్నమ్మ చెరువులో పూడికతీత



గ్రామంలోని రావు చిన్నమ్మ చెరువు పూడుకుపోవడంతో ఈ ఏడాది పూడిక తీయించేందుకు ప్రతిపాదించాం. ఉపాధి నిధులు రూ.3.47 లక్షలు మంజూరు కాగా ఉపాధికూలీలతో పనులు చేయిస్తున్నాం. కూలీలకు 1.257 పనిదినాలు ఉపాధి కలగనుంది.

– ఎస్.దుర్గాదేవి, ఉపాధి పథకం మేట్, కొరిపల్లి

13న మినీ జాబ్‌మేళా

కాకినాడ సిటీ: బెస్ట్ కెరీర్స్ ఇండియా, కాకినాడ ఆధ్వర్యంలో ఈనెల 13న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఎండీ కేవీ రమణ బుధవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఇండిగో ఎయిర్‌లైన్స్, భారత్ మొబైల్ కంపెనీ, బిగ్ బాస్కెట్, పంజాబ్ నేషనల్ బ్యాంకు మెట్‌లైఫ్, అపోలో ఫార్మసీ సంస్థల్లో ఉద్యోగాలకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బిటెక్, ఎంబీఏ వరకు చదువుకుని, 18 నుంచి 45 ఏళ్ల లోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి 40 వేలు వరకు జీతం ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 13వతేదీ శనివారం ఉదయం 9.30 గంటలకు బెస్ట్ కెరీర్స్ ఇండియా ఆఫీస్, గాంధీనగర్ రైతు మార్కెట్ దగ్గర, నండూరివారి వీధి, గాంధీనగర్ నందు బయోడేటాతో హాజరు కావచ్చన్నారు.

పూడికతీత వేగవంతం చేయండి

కాకినాడ సిటీ: నగరంలో జరుగుతున్న పూడిక తీత పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. బుధవారం ఆయన చీడీల పొర మెయిన్ డ్రైన్ పూడిక తీత పనులను పర్యవేక్షించి పనులు మరింత వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాలు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

నవరత్నాలతో నవోదయం



కరప శివారు ఆర్‌కే కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కన్నబాబు
- ఆర్‌కే నగర్‌కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం

కరప: సీఎం జగన్ అమలుచేస్తున్న నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి నాలుగైదు పథకాలతో ప్రయోజనం చేకూరి, పేద వర్గాలలో నవోదయం వికసిస్తోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. బుధవారం కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీలో స్థానిక నాయకులతో కలసి ఆయన గడప గడపకూ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత బేడ, బుడ్గ జంగాల వారికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని, ఆ సామాజికవర్గం వారు అడగ్గా, దీనిపై ప్రభుత్వం కమిటీ వేశామని, ఆ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత సీఎం జగన్ అందరికీ న్యాయం చేస్తారన్నారు. మొదటిరోజు కాలనీ, అగ్నికుల క్షత్రియులు, నక్కావారి ఎస్సీ వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికలలో జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే కన్నబాబుకు సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీటీసీ సభ్యులు పాట్నీడి భీమేశ్వరరావు, మద్దూరి గంగాభవాని, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీనాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్, మద్దూరి భాస్కర్, చొల్లంగి దుర్గారావు, ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, గ్రామకార్యదర్శి వి.సునీల్‌కుమార్, విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ- స్టాంపింగ్ చట్టబద్ధమే

- నాన్ జ్యుడీషియల్ స్టాంప్ కొరత సృష్టించినా.. అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ నాగలక్ష్మి

కాకినాడ లీగల్: అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజు రిజిస్ట్రేషన్లకు స్టాంప్ పేపర్లే అక్కర్లేదని, ఇ-స్టాంపింగ్ అయినా చట్టబద్ధమేనని ఉమ్మడి జిల్లా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ జుడిషియల్ స్టాంపులకు సమాంతరంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఈ-స్టాంపింగ్ విధానంలో కూడా అవసరమైన నాన్ జుడీషియల్ స్టాంపులను పొందవచ్చన్నారు. ఈ స్టాంపింగ్ ద్వారా వేయబడిన స్టాంపులు, సాధారణ నాన్ జుడీషియల్ బాండ్ పేపర్లతో సమానంగా చలామణి అవుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజల తమ సమీపంలోని ఇ- స్టాంపింగ్ కేంద్రాలు, లైసెన్స్ వెండర్ల వివరాలను 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.రిజిస్ట్రేషన్.ఏపీ.జీవోవీ.ఇన్' లో తెలుసుకోవచ్చన్నారు. కాకినాడ డీఐజీ పరిధిలో కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ రిజిస్ట్రేషన్ జిల్లాల్లో విస్తరించిన అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజల ఉపయోగార్థం నాన్ జుడీషియల్ స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పది, ఇరవై, యాభై, వంద రూపాయల విలువ గల స్టాంపులు అయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కౌంటర్లలోనూ, అధీకృత స్టాంపు వెండర్ల వద్ద లభ్యమవుతాయని, నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కృత్రిమ కొంత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలను కోరారు. స్థానిక 11వ డివిజన్ దుమ్ములపేట రైల్వే గేట్ ప్రాంతంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఏడీసీ నాగనరసింహారావు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు. స్థానికులు పేర్కొన్న కొన్ని సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ గద్దేపల్లి దానమ్మ, స్థానిక నాయకులు నర్ల వరలక్ష్మి, గద్దేపల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వారసత్వంపై అవగాహన

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇంజినీరింగ్ రెండో సెమిస్టర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచం మీ వారసత్వం కోసం ఎదురు చూస్తోంది అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా పూర్వ విద్యార్థి, డాక్టర్ నాగిరెడ్డి హాజరై లక్ష్య సాధన, పోరాట పటిమ, విద్యార్థులు నేర్చుకోవలసిన మెళకువలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ మీరా సాహెబ్, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత ఉద్యమాన్ని ముందుకు నడపాలి

బోట్‌క్లబ్: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ పీవీ రావు స్ఫూర్తితో దళిత ఉద్యమాన్ని ముందుకు నడపాలని పీవీ రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్‌కుమార్ అన్నారు. పీవీ రావు మాలమహానాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పీవీ రావు 72వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ జరిగిన పోరాటంలో ముందుండి నిస్వార్థంగా నడిపించి చివరకు ప్రాణాలను సైతం జాతి కొరకు అర్పించిన నిస్వార్థ నాయకుడు పీవీరావు అన్నారు. మహానాడు జిల్లా అధ్యక్షుడు జక్కల వేంకట సత్యప్రసాద్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మాత సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- ఎంపీ వంగా గీత
- కుంభాభిషేకం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం



కుంభాభిషేకం వద్ద బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

కాకినాడ: మత్స్యకారులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక అచ్చంపేట జంక్షన్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రూ.149 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన నాలుగు లైన్ల జాతీయ రహదారిలో భాగంగా కుంభాభిషేకం వద్ద ప్రతిపాదించిన బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కేఎస్‌పీఎల్ ఎండీ కేవీ రావు తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపీ గీత మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు తమ హయాంలో ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. మత్స్యకార భరోసాతో పాటు అగ్నికుల క్షత్రియ, వాడబలిజ మత్స్యకారులకు సముచిత ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధిని ఓర్వలేక వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుంబాభిషేకం రేవును తరలిస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పోర్టు విస్తరణలో భాగంగా కుంభాభిషేకం రేవు వద్ద ఉన్న 34 చిన్న చిన్న కట్టడాలను సమీప ప్రాంతానికి నష్టపరిహారం ఇచ్చి మరీ తరలిస్తున్నామని, అయితే దీనిని కూడా రాజకీయం చేసి తప్పుదారి పట్టించేందుకు వనమాడి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, చోడిపల్లి సత్యప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, మాజీ కార్పొరేటర్ గద్దేపల్లి దానమ్మ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పరివర్తన బాలలకు వితరణ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఆనంద్‌కుమార్, అరుణ

బాలాజీచెరువు: సామాజిక సేవలో కెనరా బ్యాంక్ ముందు ఉంటుందని రీజనల్ ఆఫీస్ అసిస్టెంట్ జీఎం జీఎస్‌టీ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరివర్తన బాలల సంరక్షణ కేంద్రానికి నిత్యావసర వస్తువులు అందజేశారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ పి.అరుణ మాట్లాడుతూ పోషక ఆహార లోపాన్ని నివారించేందుకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌బాబు, సీనియర్ మేనేజర్ జగదీష్, సభ్యులు రాంబాబు, శ్రీధర్, దుర్గాప్రసాద్, రాజకుమారి పాల్గొన్నారు.


పటిష్టంగా ఆరోగ్యశ్రీ అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం నగదు రహిత వైద్యం రోగులకు అందించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రోగుల నుంచి డబ్బు వసూలు చేసిన ఆసుపత్రులకు జరిమానా విధించడం జరిగిందన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో ఆర్.రమేష్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ పి రాధాకృష్ణ, డీసీహెచ్ఎస్ విష్ణువర్ధిని తదితరులు పాల్గొన్నారు.

పెదజీయర్‌స్వామి అవతారస్థానం కాకినాడ



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న చిన జీయర్ స్వామి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ పట్టణం పెద్దజీయర్‌స్వామి వారి అవతారస్థామని అందుకే తనకు ఎంతో ఇష్టమైన నగరమని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. దేవాలయం వీధిలో నిర్మించిన అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం ఆయన కాకినాడ నగరం వచ్చారు. పెద్దజీయర్ స్వామి 1909లో ఈ పట్టణంలో జన్మించారన్నారు. ఈ ఆలయ నిర్మాణంతో కాకినాడకు కళ వచ్చిందన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- రోటరీ యూత్ సర్వీసెస్ చైర్మన్ రమణారావు
- మహిళల హాకీ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): రోటరీ యూత్ సర్వీసెస్ మంత్‌లో భాగంగా యువతకు నైపుణ్యాలను పెంపొందించేందుకు పలు క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ యూత్ సర్వీసెస్ చైర్మన్ టీవీ రమణారావు పేర్కొన్నారు. బుధవారం క్లబ్ ప్రెసిడెంట్ సురభిశారద ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానంలోని హాకీ మైదానంలో మహిళలకు టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ధరణి కన్‌స్ట్రక్షన్స్ అధినేత రమణారావు మాట్లాడుతూ యువతకు వారి వారి క్రీడల్లో నైపుణ్యాలు వృద్ధి చేయడానికి టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. హాకీ కోచ్ రవిరాజు మాట్లాడుతూ టోర్నీ నిర్వహిస్తున్న రోటరీ సభ్యులను అభినందించారు. చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ కాకినాడ చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులు బెలూన్లు ఎగురవేసి, శాంతి కపోతాలను గాలిలోకి వదిలి, ఫ్రీహిట్ గోల్స్ వేసి టోర్నీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ పాస్ట్ గవర్నర్ టిక్కు, ఎలక్ట్ ప్రెసిడెంట్ గోపు కాశీవిశ్వనాథ్, సెక్రటరీ కోనాడ ప్రకాశరావు, సభ్యులు రిక్కి గూటం, స్వరాజ్, డాక్టర్ విజయ కృష్ణ, సలాది సూర్య కిరణ్, బ్లూస్టార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠాపన



కరపలోని దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కరప: స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని దుర్గాదేవి ఆలయంలో కనకదుర్గ అమ్మవారి 35వ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొంపెల్ల చక్రధరరావు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూర్ణాభిషేకం, కుంకుమార్చన చేశారు. భక్తులు సమకూర్చిన వెండి, బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాన్నదానంలో కరప పరిసర గ్రామాల నుంచి పదివేల మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రీస్తు మార్గదర్శకంలో జీవించండి

- సువార్తీకుడు ఎబినేజర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సువార్తికులు జోయల్‌రాజు

నాగమల్లితోట జంక్షన్: యేసు క్రీస్తు మార్గంలో జీవించాలని పాలకొల్లుకు చెందిన క్రీస్తు సంఘ సువార్తీకుడు ఎస్.ఎబినేజర్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక మెక్లారిన్ గ్రౌండ్స్‌లో జిల్లా క్రీస్తు సంఘాల ఆధ్వర్యంలో యేసు క్రీస్తు రక్షణ సువార్త మహాసభలు–2023 ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. 10, 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ సభలలో తొలిరోజు గొల్లప్రోలు క్రీస్తు సంఘ సువార్తీకులు ఎంఎస్ జోయల్‌రాజు మొదటి సందేశాన్ని, ప్రత్యేక సందేశంను అతిథులు ఎబినేజర్, నెహెమ్యాగూటం అందించారు. ఈ సభల నిర్వహణకు క్రీస్తు సంఘ సువార్తీకులు బి.జాన్‌రత్నం, యం.జాన్‌డీన్, టి.జ్ఞానసుధీర్, మోజెస్ కుమార్, అబ్రహం లింకన్ సహకారం అందించారు. అతిథులుగా రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు టి.ప్రసన్న కుమార్, క్రీస్తు సంఘ సువార్తీకులు జాషువాగూటం, నెహెమ్యా గూటం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీస్తు సంఘ సువార్తీకులు పాల్గొన్నారు.

తాటాకుల పాక దగ్ధం

కరప: గ్రామ శివారు పేపకాయలపాలెంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకులపాక దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలమేరకు పేపకాయలపాలెంలోని సాయిబాబా గుడి సమీపంలో ఆచంట రాంబాబుకు చెందిన పశువుల పాక ఉంది. బుధవారం హఠాత్తుగా రోడ్డుపక్కన ఉండే బూడిద నుంచి నిప్పురవ్వలు ఎగసిపడటంతో పశువులపాక పూర్తిగా కాలి బూడిదైంది. స్థానికులు స్పందించి మంటలను ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది.